పోటీ పడి ఆడేవాళ్లం


స్పోర్ట్స్ హబ్‌లో అల్లరి నరేష్, ఆర్యన్ రాజేష్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆటలంటే ఇప్పుడు కాస్త ఆసక్తి తగ్గినా.. చిన్నప్పుడు అన్నతో పోటీపడి ఆడేవాడినని సినీ హీరో అల్లరి నరేష్ అన్నారు. ఆదివారం మణికొండలోని ఈవీవీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ హబ్‌ను తన సోదరుడు ఆర్యన్ రాజేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ తాను రోజూ గంట పాటు షటిల్ ఆడుతుంటానని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రేటర్‌లో చిన్నచిన్న మైదానాలు కూడా కనిపించడం లేదని, ఇంత పెద్ద స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను ఆయన అభినందించారు.

మార్చి 22న 'మెలోడియస్ క్వీన్ సునీత ఉపద్రష్ట'


లోగో ఆవిష్కరిస్తున్న ఆర్‌పి పట్నాయక్, సునీత

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో మార్చి 22న 'మెలోడియస్ క్వీన్ సునీత ఉపద్రష్ట' ప్రత్యక్ష సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-1లోని ఓ హోటల్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మ్యూజిక్ డైరెక్టర్ ఆర్‌పి పట్నాయక్, టెంపుల్ బెల్ ఈవెంట్స్ నిర్వహకులు కౌశిక్‌రామ్ మద్దాలి, ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ ఎండీ వరప్రసాద్ తదితరులతో కలిసి సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. చాలా రోజుల తర్వాత హైదరాబాద్ ప్రేక్షకులకు మంచి సంగీత ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రదర్శన మొదటి టికెట్‌ను సినీదర్శకుడు ఆర్‌పి పట్నాయక్ కొనుగోలు చేశారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో అనుమానాలు నివృత్తి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యార్థులు వారి తల్లిదండ్రుల అనుమానాలను నివృత్తి చేసేందుకు బంజారాహిల్స్ తాజ్ డెక్కన్‌లో ఎక్సెల్లా సంస్థ ఆదివారం ఎడ్యుకేషనల్ ఫెయిర్ నిర్వహించింది. యాంకర్ శ్రీముఖి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫెయిర్‌లో ఆయా యూనివర్సిటీలో అందిస్తున్న కోర్సులను ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీసా తీసుకోవడంలో ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కారాలు వివరించారు.


వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

వడ్డెర దేరంగుల బాలయ్య సేవలు మరువలేనివి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డెర దేరంగుల బాలయ్య వర్ధంతి రహ్మత్‌నగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని బాలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. వడ్డెర సంఘం ముఖ్య సలహాదారు ఓర్సు కృష్ణయ్య, సంఘం రాష్ట్ర నాయకులు ఓర్సు అడవయ్య, కోశాధికారి దండుగుల అనంతరావు, డాక్టర్ సత్యనారాయణ, బొజ్జయ్య నాయక్, రాహుల్, సింగారి శ్రీనివాస్, మన్సూర్, ఇక్బాల్, సాబేర్, హైమద్, లింగమూర్తి, ఆర్కే వేణు, బాలయ్య కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


సదస్సులో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ సభ్యులు

విద్యుత్‌రంగ పరిరక్షణే లక్ష్యం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగం ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ సభ్యులు తీర్మానం చేశారు. జాతీయ స్థాయిలో విద్యుత్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థల పరిరక్షణ కోసం టీఎస్ జెన్‌కోలో 16వ జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా మల్లురవి, కామ్రేడ్ అమర్‌జిత్ కౌర్‌లు పాల్గొని విద్యుత్ రంగ పరిరక్షణకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రెండోరోజూ ఆదివారం నిర్వహించిన సదస్సులో సభ్యులు పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్.మూర్తి, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సమీఉల్లా, ఉపాధ్యక్షుడిగా వేమునూరి వెంకటేశ్వర్లు, ఉప ప్రధాన కార్యదర్శిగా జి సాయిబాబా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐఎఫ్ఈఈ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహన్‌శర్మ, అధ్యక్షుడు, సద్రుద్దీన్ రానా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా, రామేశ్వర్, పి పాండిల్, కృష్ణ బియర్, ఎన్.పద్మారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, సుధీర్ పాల్గొన్నారు.

పాటిగడ్డలో పవర్‌బోర్ ప్రారంభం


పవర్‌బోర్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

బేగంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు వాటర్ సమస్య ఉందని స్థానికులు ఆయనకు తెలిపారు. దీంతో పవర్‌బోర్ వేయిస్తానని అప్పట్లో వారికి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా పాటిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను పార్టీ నాయకులు నెమలి ఆనంద్, పురురవా రెడ్డిలతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

సామాజిక సేవలో రోటరీ క్లబ్ ప్రధాన భూమిక

అమీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సామాజికసేవలో రోటరీ క్లబ్ ప్రధాన భూమిక పోశిస్తోందని క్లబ్ 3150 డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ (ఆర్‌సీహెచ్ఎన్) ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రభుత్వ స్కూల్ విద్యార్థినులకు ఆదివారం సైకిళ్లను పంపిణీ చేశారు. సిస్టర్ నివేదిత పాఠశాలలో ఆర్‌సీహెచ్ఎన్-వెల్నెస్ ప్రాజెక్ట్ సమన్వయకర్త ఎం.హరిహరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదివే బాలికలకు సైకిళ్ల పంపిణీతో పాటు త్వరలో మరో రూ.25 లక్షలతో కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తొలివిడతలో 5 వందల మంది బాలికలకు సైకిళ్లను అందజేస్తున్నామని సమన్వయకర్త హరిహర ప్రసాద్ వెల్లడించారు. ఆర్‌సీహెచ్ఎన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ జి.మహాలక్ష్మి, డాక్టర్ మణికందన్, జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు నిలయం

- సైంటిఫిక్ కాలనీలో ఒకేచోట ఐదు ఆలయాలు
- 15 ఏళ్లుగా అయ్యప్పలకు అన్నదానం
- 27 నుంచి శ్రీ శివ పంచాయతన ప్రతిష్ట,
- నవగ్రహాల పునఃప్రతిష్ట


ఆలయంలో కొలువుదీరిన సాయిబాబా

అమీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట సైంటిఫిక్ కాలనీలోని వీరాంజనేయస్వామి-సాయిమణికంఠ ఆలయం ఆధ్యాత్మికతకు నిలయంగా విరాజిల్లుతోంది. 1963లో శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. నేడు ఐదు ఆలయాలను నిర్వాహకులు ఒకేచోట నిర్మించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కుందారం ప్రభాకరచారి సంకల్పసిద్ధికి దాతలు ముందుకు వస్తుండడంతో 1975లో నవగ్రహాలు, శివాలయం, 2009లో కళ్లు మిరమిట్లు గొలిపేలా శ్రీ సాయి మణికంఠ ఆలయం, 2013లో సాయిబాబా ఆలయాలను ఆధునిక హంగులతో నిర్మించారు. రోజురోజుకూ భక్తుల తాకిడి అధికమవుతుండడంతో ఆలయం లోపల ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. ప్రధానంగా ఈ ఆలయంలో గణేశ్, శ్రీ దేవీశరన్నవ రాత్రి, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

27 నుంచి నవగ్రహాల పునఃప్రతిష్ట

శోభకృత్ నామ సంవత్సరం మాఘమాస బహుళ పంచమిని పురస్కరించుకుని ఈ నెల 27న ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 29న ఆలయంలో శ్రీ శివ పంచాయతన ప్రతిష్ట, నవగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంతోపాటు ఆంజనేయస్వామి ఆలయం ప్రహరీ, నవగ్రహాలకు నూతన ఆలయం నిర్మించనున్నారు. ఈ మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో నిర్వాహకులు సకల ఏర్పాట్లను చేస్తున్నారు.

120 రోజులపాటు అన్నదానం

ఈ ఆలయంలో అయ్యప్ప స్వాములకు సెప్టెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు అన్నదానం చేస్తున్నారు. 2009లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేటికీ కొనసాగుతోంది. మొదట్లో కేవలం వంద మంది స్వాములకు మాత్రమే బిక్ష అందించే నిర్వాహకులు నేడు 600 మందికి పైగా భక్తులు వస్తున్నా అప్పటికప్పుడు తయారు చేసి అందజేయడం విశేషంగా చెప్పవచ్చు. ముఖ్యంగా కన్నెస్వాములకు రాత్రివేళ ఆలయంలోనే బస ఏర్పాటు చేసి అల్పాహారం కూడా అందిస్తున్నారు. ఇక్కడ 18 మెట్లతో నిర్మించిన అయ్యప్ప ఆలయం భక్తులను శబరీలో ఉన్నామా అనే భ్రమను కల్పిస్తోంది. చుట్టూ అద్దాలతో నిర్మించిన మండపంలో కొలువుదీరిన సాయిబాబా భక్తులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నారు.

భక్తులు, దాతల సహకారంతోనే..



భక్తులు, దాతలు అందజేస్తున్న సహాయ, సహకారాలతో ఆలయాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాం. 1963లో మా తాత, తండ్రి నిర్మించిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం ఆధునికీకరణతోపాటు మరో నాలుగు ఆలయాలను నిర్మించాం. భగవత్ కృపతో తాను సంకల్పించే ఏ దైవ కార్యానికైనా దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారు. వీరి సహకారంతోనే ఉత్సవాలు, అయ్యప్పలకు అన్నదానం చేస్తున్నాం. తన ఊపిరి ఉన్నంత వరకు భగవంతుడి సేవకే జీవితం అంకితం.

- కుందారం ప్రభాకరాచారి ఆలయ ప్రధాన కార్యదర్శి


ఆంజనేయస్వామి ఆలయం

ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ ఇంట్లో చెలరేగిన మంటలు

- పేలిన గ్యాస్ సిలిండర్


పూర్తిగా కాలిపోయిన గది, అందులోని వస్తువులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు చెందిన ఇంట్లోని మొదటి అంతస్తులో కొంతకాలంగా కోటగిరి విజయలక్ష్మి నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఫ్రిజ్ నుంచి పొగలు రావడం ఆమె గమనించింది. వెంటనే మొదటి అంతస్తు నుంచి కిందకు దిగివచ్చి అక్కడ ఉన్న వారికి విషయాన్ని చెప్పింది. క్షణాల్లోనే ఆ గదిలో భారీ మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంటల దాటికి ఫ్రిజ్‌లోని గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలాయి. ఈ సమాచారాన్ని హయత్‌నగర్, రామోజీఫిల్మ్‌సిటీలోని అగ్నిమాపక సిబ్బందికి చెప్పారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. విజయలక్ష్మి దాచుకున్న రూ.12వేలు, దుస్తులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

తక్షణ సాయం కింద రూ. 5 వేలు

విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం కింద తహసీల్దార్ రూ.5 వేలు మంజూరు చేశారు. ఆ నగదును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ బాధితురాలికి అందజేశారు. శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, సత్తయ్య, సాంబయ్య, మహేందర్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కార్మికుడి మృతి

హైదరాబాద్‌సిటీ: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ సాదత్‌నగర్‌కు చెందిన సద్దాంషేక్ బక్షు(32) మేస్త్రీ. అలీనగర్‌లోని ఓ భవనం రెండో అంతస్తులో ఆదివారం అల్యూమినియం రాడ్‌తో ఫ్లోరింగ్ పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తాకింది. కరెంట్ షాక్ కొట్టడంతో అతడు పక్కనే ఉన్న మెట్లపై పడ్డాడు. వెంటనే సమీపంలోని ఒవైసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. భార్య హీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● పరామర్శ



వెంకటగిరి బూత్ బీజేపీ ప్రధాన కార్యదర్శి నిరుడు రవి (టిల్లు రవి) తల్లి యాదమ్మ మృతి చెందటంతో విషయం తెలుసుకున్న ఆ పార్టీ జాతీయ మహిళా మోర్చా కార్యకవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని ఆదివారం అతడి నివాసానికి వచ్చి పరామర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నేతలు పులిరామ్, బడుగు సతీష్ తదితరులు.

- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి


పోస్టరును ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీఐటీయూ నాయకుడు ఆర్.అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం యూసుఫ్‌గూడ లేబర్‌అడ్డా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టరును ఆయన ఆవిష్కరించారు. లేబర్‌అడ్డా వద్ద షెడ్డు ఏర్పాటు చేసి ఐదు రూపాయల భోజనం సౌకర్యం కల్పించాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని, పట్టణ ఉపాధి హామీ పథకం కల్పించి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, రమణ, రామారావు, కృష్ణ, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పార్లమెంటు అభివృద్ధి కోసం మేనిఫెస్టో


మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ నేత, సీపీ వేణుగోపాలస్వామి సికింద్రాబాద్ పార్లమెంటు మేనిఫెస్టోను రూపొందించారని కాంగ్రెస్ ఫర్ సికింద్రాబాద్ స్టూడెంట్స్, వర్కింగ్ ప్రొఫెషనల్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంటు మేనిఫెస్టోను సంస్థ ప్రతినిధులు హర్షవర్థన్, రంగారెడ్డి, సుశృత్, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఇందులో భాగంగా సీపీ వేణుగోపాలస్వామి సారథ్యంలో నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థల నిధులను కూడా వినియోగించేలా ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను స్ఫూర్తిగా తీసుకొని వేణుగోపాలస్వామి సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంటును దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, ఆ మేరకు తమ వద్ద ప్రణాళికలు ఉన్నట్లు వారు తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఈనెల 12 యాత్ర ప్రారంభమై, 40 రోజుల పాటు సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు షరీఫ్, సూరజ్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టరును ప్రదర్శిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లు మురళి మనోహర్ తదితరులు

'రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో అన్నికులాల సమగ్ర కులగణన జరపాలని వక్తలు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన జరుపుతామని అంటున్నారని, దీని వలన బీసీలు ఎక్కువగా నష్టపోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేయడానికి ఎందుకు భయపడుతోందని వారు ప్రశ్నించారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ మురళీమనోహర్, దేవల్ల సమ్మయ్యల అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అన్ని కులాల (బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ) సమగ్ర కులగణన జరపాలి. బీసీల డిమాండ్ పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు బీసీలకు వ్యతిరేకమని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. అందరమూ అన్యాయాలకు గురైన వారిమేనని, కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసినా, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు కులగణన చేయలేక పోయినా, తాము అధికారంలోకి వస్తే కులగణన చేపడుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేస్తామని అంటున్నారన్నారు. ఏపీలో బీసీలలో అన్ని జాతుల వివరాలు ఉన్నాయన్నారు. దేశంలో బీసీలలో 234 కులాలు, ఉపకులాలు, ఎస్సీలు 83 కులాలు, ఎస్టీలలో 93, ఓసీలలో 310 కులాలు ఉన్నాయని, కులగణన జరిగితే సమగ్ర సమాచారం వస్తుందన్నారు. కులగణన జరిగితేనే బీసీలు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. మరోసారి సీఎంతో మాట్లాడి లీగల్ సమస్యలు చెప్పాలన్నారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గత సీఎం చెప్పారు, వెంటనే ప్రకటించారు. అయితే సెన్సెస్ లేకుండా అది సాధ్యం కాదు. ఎంత మంది ఏ స్థాయిలో ఉన్నారో తేల్చకుండా చేయడం అయ్యే పనికాదు. కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో, శాఖలలో ఎక్కువగా ఓసీ అధికారులనే నియమించి, ఇతర కులాలు, మతాలకు చెందిన అధికారులను పట్టించుకోవడం లేదన్నారు. బీసీ కులగణన కాదు, అన్ని కులాల సమగ్ర కులగణన చేపట్టాలని ప్రొఫెసర్ మురళీ మనోహర్ అన్నారు. ఇన్ని సంవత్సరాలు కులాలు గణాంకాలు లేకుండానే లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారన్నారు. 1951లో జరిగిన జనాభా లెక్కల్లో కులం అనే అంశం తొలగించడంతో కులాల లెక్కలు లేకుండా పోయాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినా వాటి వివరాలు బహిర్గతం చేయలేదన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు పి.ఎల్. విశ్వేశ్వరరావు, సింహాద్రి, సురేంద్ర బాబు, వెంకట నారాయణ, తిరుమలి, ప్రభంజన్ యాదవ్, సదానంద్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

ఉన్నత విద్యలో తెలంగాణ టాప్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో జాతీయ స్థాయి సగటు 28 శాతం (జీఈఆర్) ఉంటే, తెలంగాణలో ఈ సగటు 40 శాతంగా ఉందని, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ.రేవతి తెలిపారు. అంబేడ్కర్ వర్సిటీ, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి దక్షిణ భారత ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 'తెలంగాణలో సంక్షేమ పథకాల అమలు' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గత దశాబ్ద కాలంగా ఆయా రాష్ట్రాల్లో అమలయ్యే సంక్షేమ కార్యక్రమాలను పరిశీలిస్తే తెలంగాణ సంక్షేమ పథకాలు ప్రజల జీవన స్థితిగతులను మార్చాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే వారిలో మహిళలు, ఎస్సీ, ఎస్టీల సంఖ్య కూడా పెరుగుతుండడం శుభపరిణామన్నారు. వర్సిటీ సామాజిక శాస్త్రం విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయి, లబ్ధిదారుల స్థితిగతులు మారాయా లేదా అనే అంశాలను పరిశీలించాలని పరిశోధక విద్యార్థులకు సూచించారు. ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.కె.ముత్యంరెడ్డి, కార్యదర్శి డా.బి. వెంకటేశ్వరరావు సంస్థ లక్ష్యాలను, కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు పరిశోధక విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వర్సిటీ ఆర్థిక శాస్త్రం విభాగాధిపతి, డా.కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది

జాతీయ జానపద శాస్త్రీయ ఉత్సవాల ముగింపు వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్


పురస్కారాలు అందజేస్తున్న స్పీకర్, బీసీ కమిషన్ చైర్మన్

మోతీనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కళలను ప్రోత్సహించడంతో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. జాతీయ జానపద శాస్త్రీయ నృత్య వేడుకలు మాదాపూర్ శిల్పకళా వేదికగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కృష్ణమోహన్‌రావు హాజరయ్యారు. ఈ వేడుకలను త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ.. సనాతన నృత్యానికి ఆధ్యాత్మికతలో గొప్పస్థానం ఉందన్నారు. సాంప్రదాయాల నృత్యాల ద్వారా ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరుస్తాయన్నారు. శాస్త్రీయ నృత్యం ద్వారా అనేక వ్యాధులు దరిచేరవన్నారు. కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ కళానృత్యాలు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాయని ఇక్కడ కలలు గొప్పతనాన్ని వివరించారు. ఈ వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ రాష్ట్రాల కళా నృత్యాలను ప్రదర్శించారు. ఈ ముగింపు వేడుకలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక కళలకు తెలంగాణ రాష్ట్రం పుట్టినిల్లు అన్నారు. అనంతరం పోటీలలో ప్రతిభ చూపిన కళాకారులను ప్రతిభా కీర్తి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజాఠాకూర్, తారా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు సంఖ్య రాజేష్, సినీనటి హరితేజ, ప్రముఖ నృత్య గురువులు భాగవతుల సేతురామ్, ప్రసన్న రాణి, మిస్ ఇండియా అనీషారెడ్డి, రిటైర్డ్ ఎస్పీ కె. రాజా శిఖమాన్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

యునైటెడ్ ఫూలే ఫ్రంట్


మాట్లాడుతున్న యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు

పంజాగుట్ట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ (యూపీఎఫ్) ఆరోపించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిందని తెలిపారు. అయితే ఈ బడ్జెట్‌లో సంవత్సరానికి కేవలం 8 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అంటే ఐదేళ్లలో 40 వేల కోట్లు మాత్రమేనన్నారు. మరి మిగతా 60 వేల కోట్లు ఎప్పుడిస్తారని ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కో-కన్వీనర్‌లు తాడూరి శ్రీనివాస్, రాజారామ్ యాదవ్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం 8 వేల కోట్ల రూపాయలు కేటాయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు నామమాత్రం బడ్జెట్ ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కె.శ్రీనివాస్, నాగేందర్‌గౌడ్, ఆర్‌వీ మహేందర్ కుమార్, ఏ.హరి పాల్గొన్నారు.

● ప్రత్యేక పూజలు



వెంగళరావునగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం జరిగిన పూజల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ దేదీప్య, ఆలయ కమిటీ ప్రతినిధి ఇ.నర్సింగరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించం

పద్మారావునగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారెవరైనా ఉపేక్షించేది లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సిలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని చాచానెహ్రూనగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిసరాలలో ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం, గంజాయి సేవిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రోడ్లపై ఇష్టం ఉన్నట్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని స్థానిక ప్రజలు తలసానికి ఫిర్యాదు చేసారు. స్పందించిన ఆయన ఆదివారం ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి సీసీ నగర్‌లో పర్యటించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారిపై కఠిన చర్యలు చేపట్టాలని గాంధీనగర్ సీఐ రవికుమార్‌ను తలసాని ఆదేశించారు. డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు పరామర్శ..

బన్సిలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు వై.శ్రీనివాస్, వై.సురేశ్‌లను తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సీసీనగర్‌కు చెందిన సురేశ్ మాతృమూర్తి రాజమణి మరణించిన విషయం తెలుసుకొన్న తలసాని ఆదివారం సీసీనగర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

ముగిసిన డిఫెన్స్ పెన్షనర్స్ జనరల్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న సీడీఏ డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ శ్రీనివాస్ రాజ్ బేతం ఐడీఏఎస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ అకౌంట్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో 26వ వార్షిక సదస్సు తిరుమలగిరి ఎంసీఎంఈ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీఏ డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ శ్రీనివాస్ రాజ్ బేతం ఐడీఏఎస్ హాజరై పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు సూచించారు. ఈ సదస్సులో దాదాపు 400మంది పెన్షనర్లు కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటా, పాట నిర్వహించడంతోపాటు 75 ఏళ్లు దాటిన పెన్షనర్లను సన్మానించారు. డిఫెన్స్ అకౌంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీఎస్ఎల్ నరసింహన్, జనరల్ సెక్రటరీ పి.శ్రీనివాస్‌లతోపాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయ సాధనకోసం పాటుపడాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని, అప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. దేశంలోని యువత సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు. దోమలగూడలో రామకృష్ణమఠం స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, సహాయ ప్రధాన కార్యదర్శి తత్వ విదానంద స్వామి, పుణే రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీకాంతనంద, రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానానంద స్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలను అనుసరించాలని సూచించారు. స్వర్ణోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. భువనేశ్వర్ రామకృష్ణ మఠం తొలి అధ్యక్షులు బ్రహ్మానంద స్వామి జయంతి సందర్భంగా ఆయన జీవితంపై సందేశాలు, ప్రసంగాలు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ప్లే ఫర్ మల్కాజ్‌గిరి' విజేత జేఏసీ టీమ్

తిరుమలగిరి ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా బొల్లారం కంటోన్మెంట్ పార్క్‌లో జరిగిన ప్లే ఫర్ మల్కాజ్‌గిరి టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతలకు బీజేపీ నాయకుడు మల్క కొమరయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్‌లో విజేతలుగా నిలిచిన జేఏసీ టీమ్‌కు ట్రోఫీతో పాటు 20వేల రూపాయల నగదు పురస్కారాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

రాంగ్ రూట్‌లో వచ్చిన కారు - ఆటో ఢీ

బోయినపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో వచ్చిన ఓ కారు అదుపుతప్పి ఓ ఆటోను ఢీ కొట్టిన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయినపల్లి మిలిటరీ డైరీ ఫారం చౌరస్తా వద్ద జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ప్రాంతానికి చెందిన సుదాకర్ ప్రైవేట్ ఉద్యోగి. ఇతను తన భార్య శైలజ, కుమారుడు అశ్విక (4), కూతురు రితికలతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో కొంపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటో ఉదయం 6 గంటల సమయంలో బోయినపల్లి మిలిటరీ డైరీ ఫారం చౌరస్తా వద్దకు చేరుకుంటున్న సమయంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన నెంబర్ ప్లేట్ లేని కొత్త వోక్స్ వ్యాగన్ కారు ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ కారును వదిలేసి పారిపోయాడు. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితులు బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. డ్రైవర్ మలక్‌పేట్ వాసిగా పోలీసులు గుర్తించారు.

సంక్షేమానికి ప్రాధాన్యం భేష్..!

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై లష్కర్‌వాసుల భిన్నాభిప్రాయాలు

రాష్ట్ర ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై లష్కర్ వాసుల నుంచి మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా, సమతుల్యంగా ఉందని కొందరు, ఎన్నికల గ్యారంటీల అమలుకు తగినట్టుగా నిధులు కేటాయింపు లేదంటూ మరికొందరు అభిప్రాయపడ్డారు. పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు, ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడం పట్ల పలువురు హర్షం ప్రకటించారు.

- సికింద్రాబాద్ జోన్ బృందం, ఆంధ్రజ్యోతి

భేషుగ్గా బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ బేషుగ్గానే ఉందని చెప్పవచ్చు. పేదల సంక్షేమానికి పాటుపడేలా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు తదితర నిర్ణయాలు బాగున్నాయి. అయితే రైతుల రుణమాఫీ తదితర అంశాలపై స్పష్టత ఇచ్చి ఉండాల్సింది.

- వల్లారపు శ్రీనివాస్, టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి

అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది



బడ్జెట్ ప్రజారంజకంగా వుంది. అన్ని రంగాలకీ కేటాయింపులు సరిగ్గా ఉన్నాయి. గత ప్రభుత్వ బడ్జెట్ కేవలం పేపర్ మీద మాత్రమే ఉండేదని, అలాంటి తప్పులు చేయకుండా కేటాయింపు చేసిన బడ్జెట్‌ను వినియోగించి ప్రజలలో గణనీయమైన మార్పులు తీసుకురావాలి.

- కాంపల్లి శ్రీనివాస్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి

ఆరోగ్యశ్రీకి కేటాయింపులు హర్షణీయం



రాష్ట్రంలో పేద మధ్యతరగతి వర్గాల ప్రజల వైద్యసేవల చికిత్స నిమిత్తం ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా పదిలక్షల రూపాయలు ఇందుకు పరిమితం చేస్తూ చర్యలు చేపడుతున్నట్లు బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థికశాఖ మంత్రి ప్రకటించడం హర్షణీయమన్నారు.

- సంతోష్, నోటరీ అడ్వొకేట్

నూతన హైకోర్టు పనులు వేగవంతం చేయాలి



గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుతూ, ప్రజా సంక్షేమానికి, అన్ని వర్గాల వారికి కేటాయింపులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమతుల్యంగా ఉంది. నూతన హైకోర్టు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. నగరంలో ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హైకోర్టు నిర్మాణంతో పాటు న్యాయమూర్తులకి, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మిస్తే సమయం ఆదా అవుతుంది.

- నాగమారుతీ శర్మ, విశ్రాంత న్యాయమూర్తి

ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా బడ్జెట్..



అరు గ్యారంటీ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించింది. ఇందుకు అవసరమయ్యే బడ్జెట్‌ను కేటాయించారు. ఆరు గ్యారంటీల పథకంలో భాగంగానే అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉన్నట్లు కనిపించింది.

- జగన్మోహన్ ముదిరాజ్, అడ్వొకేట్, సికింద్రాబాద్

టూరిజం సర్క్యూట్ ప్రతిపాదనలు బాగున్నాయి



దేవాలయాల అభివృద్ధితో పాటు, పుణ్యక్షేత్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ప్రతిపాదనలు బాగున్నాయి. ఉభయ రాష్ట్రాలలో దేవాలయాలను సందర్శించటానికి రైల్వే ఐఆర్‌సిటిసి రూపొందించిన మాదిరిగా టూర్ ప్యాకేజీలు ప్రవేశపెడితే భక్తులకి సౌకర్యంగా వుంటుంది. రాష్ట్రానికి ఆదాయం కూడా సమకూరుతుంది. ఈ దిశగా చర్యలు చేపట్టి, స్పిరిట్యువల్ టూరిజం పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలి.

- వి.పద్మనాభం, ఆధ్యాత్మికవేత్త(షాల్)

పబ్లిక్ స్కూల్స్ ప్రతిపాదన హర్షించదగింది



విద్యారంగానికి ప్రాధాన్యత నిస్తూ రాష్ట్రంలోని ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూల్ స్థాపన ఏర్పాటు ప్రతిపాదన బాగుంది. 500 కోట్లు కేటాయించడం వల్ల అక్షరాస్యత పెరగటంతో పాటు గ్రామాలలో ఉండే వారికి చదువుకోవటానికి మంచి అవకాశాలు వస్తాయి. ప్రతిపాదనతో సరిపెట్టకుండా బడ్జెట్ కేటాయించడంతో పాటు వచ్చే ఆర్థిక విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టి దశల వారీగా అన్ని మండలాలలో స్కూల్స్ ఏర్పాటుకి చర్యలు చేపట్టాలి.

-డి.నాగేశ్వరరావు, మాజీ రైల్వే అధికారి, మెట్టుగూడ

కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం వాడుకోవడం లేదు



పవర్ బోర్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పటికీ గతంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం నిధులు దారి మళ్లించిందని కేంద్ర పర్యటక, సాంస్కృతిక శాఖమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో టాయిలెట్‌లు, తాగునీటి వసతి లేని పరిస్థితి ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించిందని అన్నారు. కేంద్రం తెలంగాణకు మూడేళ్ల క్రితం 23 మైనార్టీ హాస్టల్‌కు నిధులు మంజూరీ చేస్తే అప్పటి ప్రభుత్వం కనీసం భూమి కేటాయించలేదని అన్నారు. విభజించి పాలించడం ఓటు బ్యాంకు పెంచుకోవడం కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. మాటల గారడి బడ్జెట్‌లో కనిపించిందని అన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను వాడుకోవడంలో గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్ రెడ్డి విఫలమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యామ్ సుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది రవి, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

పవర్ బోర్ల ప్రారంభం..

బేగంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను ఆదివారం పార్టీ నాయకులు నెమలి ఆనంద్, పురువారెడ్డిలతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు.

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో గల ఓల్డ్ బోయిగూడ, నల్లగుట్ట చుట్టాల బస్తీలలో ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన ఎంపి నిధుల నుంచి ఏర్పాటు చేసిన పవర్ బోర్లను రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ రవి, జీహెచ్ఎంసీ శంకర్, డీసి ఈఈ సుదర్శన్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు రూ.8వేల కోట్లు కాదు.. రూ.20వేల కోట్లు కేటాయించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.8 వేల కోట్లను మాత్రమే కేటాయించిందని, ఇవి ఏమాత్రం సరిపోవని, రూ.20 వేల కోట్లను కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల ఊసేలేదని, రూ.5,300కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లించాలన్నారు. 13 బీసీ కులాల ఫెడరేషన్లకు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, పాలకమండలిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెస్‌చార్జీలను రూ.5 వేల నుంచి రూ.20వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు నందగోపాల్, టి.రాజేందర్, జిల్లపల్లి అంజి, మట్టజయంతిగౌడ్, పృధ్వీగౌడ్, దినేష్, నిఖిల్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో అదృశ్యం.. మేడారంలో ప్రత్యక్షం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో ఇద్దరు టెన్త్ విద్యార్థినులు అదృశ్యం కావడంతో అడ్డగుట్టలో రచ్చరచ్చగా మారింది. తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అడ్డగుట్టకు చెందిన ఇద్దరు పాఠశాల విద్యార్థినులు అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ విద్యార్థినులు మేడారం జాతరలో అదృశ్యమయ్యారు. అడ్డగుట్ట, వారాసిగూడకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ క్లాస్ చదువుతున్నారు. ఈనెల 9న ఉదయం స్కూలుకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లి బ్యాగులో బట్టలు సర్దుకుని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి యాదగిరిగుట్టకు రైలు లేకపోవడంతో జూబ్లీ బస్టాండుకు వెళ్లి అక్కడినుంచి యాదగిరిగుట్టకు బస్సులో వెళ్లారు. రాత్రి 9 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. అక్కడే వెయిటింగ్ హాలులో గది తీసుకుని దేవుడి దర్శనం చేసుకున్నారు. తర్వాత మరుసటి రోజు యాదగిరిగుట్ట నుంచి మేడారం వెళుదామని అనుకుని గుట్ట బస్టాండుకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి హన్మకొండకు బస్సులు లేకపోవడంతో ఉప్పల్‌కు బస్సులో వచ్చారు. ఉప్పల్ నుంచి మళ్లీ బస్సులో హన్మకొండకు వెళ్లి అక్కడినుంచి బస్సులో మేడారం వెళ్లారు. విద్యార్థినులు అదృశ్యమైన రోజు వారి తల్లితండ్రులు తుకారాంగేట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీపుటేజీలను పరిశీలించి విద్యార్థుల ఆచూకీ తెలుసుకున్నారు. తుకారాంగేట్ పోలీసులు మేడారం వెళ్లి విద్యార్థినులను అదుపులోకి తీసుకుని ఆదివారం తుకారాంగేట్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం పిల్లల్ని తల్లితండ్రులకు అప్పగించాలా లేదా కౌన్సిలింగ్‌సెంటర్‌కు పంపించాలా అనేకోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీల్లో సదుపాయాల మెరుగునకు కృషి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యురాలు లాస్య నందిత ఆధ్వర్యంలో బస్తీల్లో సదుపాయాల మెరుగుకు కృషి చేస్తున్నట్లు బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ చెప్పారు. కంటోన్మెంట్ రెండో వార్డు గన్‌బజార్‌లో రోడ్డు నిర్మాణానికి లాస్య నందిత 25 లక్షల రూపాయిల నిధులు మంజూరు చేశారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. దేవులపల్లి శ్రీనివాస్, అబ్దుల్ వాహబ్, సురేష్, కిరణ్, సాయి, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులతో జంపన ప్రతాప్

22 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బోయినపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలోని వేంకటేశ్వర స్వామి 22వ బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 22 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 26న భారీ శోభాయాత్ర జరగనుంది. ఫిబ్రవరి 20 నుంచి 21 వరకు అధ్యాయ ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ సలహాదారుడు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. ఆదివారం బోయినపల్లి న్యూ సిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆలయ కమిటీసభ్యులు ఆలయ అర్చకులు పవన్‌స్వామి, దీపక్‌స్వామి, శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో కంటోన్మెంట్ అభివృద్ధి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు వికసిత్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ చెప్పారు. కంటోన్మెంట్‌లోని 3, 5, 7, 8వ వార్డుల్లో కోట్ల రూపాయిల తో పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీజేపీ విజయం ఖాయమని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం తథ్యమని అన్నారు. కాగా 5వ వార్డులో భూగర్భ డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ డ్రైన్స్, సీసీ రోడ్లు, 7వ వార్డులోని గన్‌రాక్ బస్తీలో పార్కు సుందరీకరణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



బాలికను శిశువిహార్ సిబ్బందికి అప్పగిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని బాలిక

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న గుర్తుతెలియని ఆరేళ్ల బాలికను రైల్వే పోలీసులు చేరదీశారు. బాలికకు మాటలు రాకపోవడంతో బధిరురాలుగా గుర్తించారు. వివరాలు తెలియకపోవడంతో ఆదివారం ఉదయం అమీర్‌పేట్‌లోని శిశువిహార్‌లో చేర్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు లేదా తల్లిదండ్రులు రైల్వేస్టేషన్‌లో విడిచిపెట్టి ఉంటారని రైల్వే పోలీసులు భావిస్తున్నారు.

ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్.. ఇంట్లో చెలరేగిన మంటలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు చెందిన ఇంట్లోని మొదటి అంతస్తులో కొంతకాలంగా కోటగిరి విజయలక్ష్మి నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఫ్రిజ్ నుంచి పొగలు రావడం ఆమె గమనించింది. వెంటనే మొదటి అంతస్తు నుంచి కిందకు దిగివచ్చి అక్కడ ఉన్న వారికి విషయాన్ని చెప్పింది. క్షణాల్లోనే ఆ గదిలో భారీ మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంటల దాటికి ఫ్రిజ్‌లోని గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలాయి. ఈ సమాచారాన్ని హయత్‌నగర్, రామోజీఫిల్మ్‌సిటీలోని అగ్నిమాపక సిబ్బందికి చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫిల్మ్‌సిటీ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. విజయలక్ష్మి దాచుకున్న రూ. 12వేలతోపాటు దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

తక్షణ సాయం కింద రూ. 5 వేలు

విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం కింద తహసీల్దార్ రూ. 5 వేలు మంజూరు చేశారు. ఆ నగదును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, సత్తయ్య, సాంబయ్య, మహేందర్, నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కార్మికుడి మృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌తో భవననిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ సాదత్‌నగర్‌కు చెందిన సద్దాంషేక్‌బక్షూ(32) భవననిర్మాణ మేస్త్రీ. అలీనగర్‌లోని ఓ భవనం రెండో అంతస్తులో ఆదివారం అల్యూమినియం రాడ్‌తో ఫ్లోరింగ్ పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తాకింది. కరెంట్‌షాక్ కొట్టడంతో అతడు పక్కనేఉన్న మెట్లపైపడ్డాడు. వెంటనే ఒవైసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. భార్య హీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన వైద్యాధికారిని డాక్టర్ నిర్మలప్రభావతి సూచించారు. ఆదివారం మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో టీబీసెంటర్ ఉంటుందని, ఉచితంగా మందులు కూడా ఇస్తారని తెలిపారు. లాలాపేట్ క్లస్టర్ డిపిఎంఓ అధికారి లింగానాయక్, కళాశాల హెచ్‌ఓడి జ్యోతి, ఆశావర్కర్ స్వరూప పాల్గొన్నారు.

గంజాయి కేంద్రంగా.. అడ్డగుట్ట



యాంటీ డ్రగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

- వ్యసనాలకు అలవాటుపడుతున్న యువత
- బస్తీలో అవగాహన కల్పించాలి: సీ.హెచ్.లక్ష్మీనారాయణ
- అడ్డగుట్టలో మాదక ద్రవ్యాల నియంత్రణ రౌండ్ టేబుల్ సమావేశం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నుంచి పిల్లల్ని రక్షించుకుందామని, బస్తీలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్.లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం అడ్డగుట్ట తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాలులో ఎంవీ ఫౌండేషన్ ఇతర సంఘాలతో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీహెచ్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయి రవాణా అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసినప్పటికీ.. గంజాయిని నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో ఎక్కడ పడితే అక్కడ గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కావడంలేదన్నారు. కో-ఆర్డినేటర్ సువర్ణ మాట్లాడుతూ.. పిల్లలందరు ఏదో ఒక మాదక ద్రవ్యానికి అలవాటుపడి బాల్యాన్ని కోల్పోతున్నారన్నారు. పిల్లల కోసం సమయం కేటాయించి వారి బాగోగులు తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. సంస్థ కార్యదర్శి భాగ్య మాట్లాడుతూ.. గంజాయి వల్ల యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, గంజాయి పబ్బుల నుంచి పల్లెటూరి వరకు వ్యాపించిందన్నారు. గంజాయిని నియంత్రించకపోతే మానవ మనుగడకే ఒక పెనుప్రమాదం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సలహాదారుడు అజయ్‌బాబు, జిల్లాకో-కన్వీనర్ రమాదేవి, మదర్స్ కమిటీ సభ్యురాలు శోభ, రామలీల, మద్యం మాదక ద్రవ్యాల కమిటీ సభ్యురాలు సుమలత, బాలమణి, ఆర్. మల్లేష్, పేరెంట్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, వరలక్ష్మి, దివ్య, ఎం.వీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య, సుమలత, సౌజన్య, లావణ్య, సిపిఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


తుకారాంగేట్‌లో విక్రయాలు



తుకారాంగేట్‌లో ఎక్కడ పడితే అక్కడ గంజాయి విక్రయాలు చాటుమాటుగా విక్రయిస్తున్నారు. తెల్లవారు సమయంలో కొందరు వ్యక్తులు తుకారాంగేట్ రైల్వే ట్రాక్ వద్ద విక్రయించి వెళ్లిపోతున్నారు. గంజాయి విక్రయాలపై అరికట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

- రామలీల, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు


గంజాయిపై అవగాహన అవసరం



ఒకప్పుడు సారా ఉద్యమ జరిగింది. ఇప్పుడు గంజాయి ఉద్యమం జరుగుతోంది. గంజాయి సరుకు ఎక్కడి నుంచి తెస్తున్నారో తెలియదు. కానీ, రెండేళ్లలో గంజాయి సరుకుతో హైదరాబాద్ నిండిపోయింది. పోలీసులు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. ఈ మధ్య బడికి వెళుతున్న టెన్త్ విద్యార్థులు కూడా తుకారాంగేట్‌లో గంజాయికు బానిసవుతున్నారు.

- సుమలత, బీఎస్పీ


కళ్లముందే గంజాయి విక్రయాలు



అడ్డగుట్ట, తుకారాంగేట్‌లో గంజాయి సరుకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కూడా పట్టించుకోవడం లేదు. కళ్లముందే గంజాయి విక్రయాలు జరుగుతున్నా ఏం చేయలేకపోతున్నాం. గడ్డమీదబస్తీ సమీపంలో ఓ కమ్యూనిటీ హాలు వద్ద గంజాయి గ్యాంగ్ హల్‌చల్ చేస్తోంది. బస్తీలో రాత్రయితే బయటకు రాలేకపోతున్నాం.

- రమాదేవి, సంఘసేవకురాలు

రాత్రయితే బయటకు రాలేకపోతున్నాం



తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకట్‌నగర్, శాస్త్రీనగర్, అడ్డగుట్ట పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చాలా సార్లు సంఘం ఆధ్వర్యంలో తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. శాస్త్రీనగర్ - వెంకట్‌నగర్‌లో రాత్రయితే చాలు బస్తీ మహిళలు బయటికి రావడానికి భయపడుతున్నారు.

- శోభ, రుద్రవీణ మహిళాసంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు